# సుశీల

సుశీల నిజంగా సుశీలే చాల తెలివిగల పిల్ల అందుకే యింట్లోనూ బయటాకూడా అందరి వద్దా మన్ననలు పొందుతూండేది పంతులు రామారావుకూడా సుశీ లంటే ప్రాణం వదిలేవాడు. తండ్రి పరంధామయ్యా సుశీలకు కావలసి నన్ని ఆటబొమ్మలు, మిఠాయిలు తెచ్చి యిస్తూండేవాడు. అప్పుడప్పుడు బేడ, పావలా చిల్లర కూడా యిస్తూండేవాడు అక్కా బావావాళ్లుసైతం పండుగలకొచ్చి తిరిగి వెళ్లేటప్పుడు సుశీలచేతిలో యింత చిల్లర పడేసి వెళ్లేవారు.

సుశీల యిష్టంవచ్చినట్టు అనవసరంగా డబ్బులుఖర్చుపెట్టేదిగాదు. తనకు దొరికిన డబ్బులు బరిణెలో వేసి అలమరులో పెట్టేది కానీ సమయం కనిపెట్టి సుశీలఅన్న గోపీ యీడబ్బు కాస్తా కాజేసి కూర్చునేవాడు. గోపీ గొడవ పడలేక అప్పుడప్పుడూ యీ డబ్బులు లేకున్నా బావుండేదను కునేది సుశీల యీ సంగతి అమ్మ నాన్నకు చెప్పినట్లయితే వారు గోపీని వీపు పగలేస్తారని వారితో సైతం చెప్పేదికాదు కానీ దొరికిన డబ్బులు గోపీకంటపడ కుండా ఎలాగ ఎత్తిపెట్టడం? అని యోచించి తుదకొక ఉపాయం ఆలోచించింది

స్టోర్ రూమ్ లో బియ్యపు బస్తాలు పడేసివున్నాయి ఆ బస్తాల సందుల్లో పెట్టి దాచేస్తే గోపీ కనుక్కోలేడని తలచింది ఆనాటి నుండి దొరకిన డబ్బంతా చిన్న పెట్టెలోపెట్టి అది ఆ బస్తాల సందులో దాచేది ఇలాగే డబ్బు పొదుపుచేసింది కొద్దిరోజులకు తొమ్మిది రూపాయలు చేరింది.

గోపీకి యీ మధ్య చిల్లర బొత్తిగా దొరకడంలేదు. సుశీల డబ్బు లెక్కడపెడుతోందో నని యిల్లంతా తెగగాలించాడు కానీ ఆచూకీ దొరకలేదు. వెదకి వెదకి

శ్రీ యస్. గోపాలరెడ్డి

వేసారి యిక తనకు డబ్బులు దొరకవని నిశ్చయించుకొని, దిగాలుగా హాల్లో కూర్చుని సుశీలను తిట్టడం మొదలెట్టాడు ఆ సమయంలో ఓ చిట్టెలుక హాలునుండి సామానుల గదిలోకి పరుగుతీసింది. గోపీ దాన్ని తరుముకొని గదిలో కెళ్లాడు ఎలుక తుర్రుమని బస్తాల సందుకెళ్లింది గోపీకూడా బస్తాల పైకెక్కి తెగవెదికాడు ఎలుక కన బడలేదు గానీ, సుశీల డబ్బులపెట్టె మాత్రంకనబడింది గోపీహృదయం సంతోషంతో ఉప్పొంగి పోయింది యిటు అటు చూస్తూ, ఉన్న డబ్బు కాస్తా కాజేసి తుర్రుమన్నాడు.

గోపీ స్టోర్ రూమునుండి పరుగెత్తడం సుశీల చూచింది కడుపున గంపెడు అగ్గిపడ్డట్టయింది వెంటనే వెళ్ళి బస్తాలసందున చూచింది. పెట్టెమాత్రముందిగానీ చిల్లర లేదు. సుశీలకు ఒక్కమారుగా దుఃఖం పొంగివచ్చింది. ఒక్క పరుగున వెళ్లి అమ్మకు చెప్పాలను కొంది. కానీ నిన్న గోపీని అమ్మ కొట్టడం గుర్తుకొచ్చేసరికి ఆ ప్రయత్నం మానుకొంది. ఒకటా, రెండా? తొమ్మిది రూపాయలు కాజేశాడు ఎలాగైనా వాడికి బుద్ధిచెప్పాలని నిశ్చయించుకుంది కానీ యెలా బుద్ధి చెప్పడం? ఎంతో యోచించి యోచించి తుదకొక నిశ్చయాని కొచ్చింది

గోపీ జల్సాగా మేటినీషో కెళ్ళి సాయంత్రం ఆరుగంటలకు యింటికొచ్చాడు. గోపీ రావడంతోటే దగ్గరికెళ్ళి "ఒరే అన్నాయ్! నేనొక లెక్క అడుగుతా చెప్తావా?" అంది

"ఏమి లెక్కో చెప్పు మరి యిట్టే చెప్పేస్తా" నన్నాడు గోపి

"నేనొకచోట డబ్బు దాచాను. దాని మొత్తం కాస్త లెక్క తప్పింది అది వరుసగా కూడి చెప్పాలి" అంది సుశీల

ఈ మాట వినేసరికి గోపీ గుండెలు ఓ మారు పీచు పీచు మన్నాయి కాని ధైర్యం తెచ్చుకొని "చెప్పూ మరి" అన్నాడు

సుశీల చెప్పడం ప్రారంభించింది "నా పెట్టెలో ఓమారు



గోపీ స్టోర్ రూమ్‌నుండి పరుగెత్తడం సుశీల చూచింది

రెండు రూపాయలు, మరియొక మారు ఒకటిన్నర వేశాను. ఇంకొక మారు రెండుంపావలా వేశాను మరియొకమారు ఒకటింబావలా వేశా. నిన్న రెండు రూపాయలు పడేశాను. మొత్త మెంతయినట్టు చెప్పు చూదాం".

గోపీ బెదురు చూపుల్తో దిక్కులు చూస్తూ "తొమ్మిది" అన్నాడు మెల్లగా.

"సరేగాని యిప్పుడు ఆ పెట్టెలో ఐదురూపాయలు వేయబోతాను అప్పు డెంతవుతుందో చెప్పు".

"అప్పుడు మొత్తం పదునాలు గౌతుంది".

"సరి యిప్పుడా అయిదూవేస్తే పదునాలు గౌతుంది. సిల్కుపావడకు సరిపోతుంది "అని గొణుక్కుంటూ వంటగదివైపు, వెళ్లిందిసుశీల.

గోపీకి తిక్క పట్టినంత పనయింది. తెగ యోచించాడు. "పెట్టెలో తొమ్మిదే అవేమో ఉన్నాయి కాజేశాను యిప్పుడు సుశీల అయిదు వేయబోతుందట. తీరా అయిదూ తీసుకెళ్ళి పెట్టె తెరచి చూస్తే దానిలో అంతకుముందు తొమ్మిదీ కనిపించకపోతే అయిదు తిరిగి వేస్తుందా? ఛీ! పొరబాటు చేశాను. యీనాడంతా ఆ డబ్బు అలాగే ఉంచి, రేపు తీసుకెళ్లుంటే తొమ్మిదీ ఐదూ చేరి పదునాలుగు వచ్చి ఉండేవి. కానీ యిప్పుడు మాత్రమేం పోయింది. నే నెత్తుకొన్న రూపాయలలో ఓరూపాయి ఖర్చయిపోయింది మిగిలిన ఎనిమిదీ వున్నాయ్. ఇప్పుడు ఒక్క రూపాయీ సరిపెట్టి తొమ్మిదీ ఆ పెట్టెలో పడేస్తే, రేపు తెల్లారే సరికే పదునాలుగు అట్టే వస్తాయి." అని యోచించి, ఓ పరుగు వెళ్లి పక్కింటి రామును బతిమాలి, ఒక రూపాయి అప్పుతెచ్చి, సుశీల లేని సమయం కనిపెట్టి, ఆ తొమ్మిది రూపాయలూ పెట్టెలో పడేశాడు.

అందరూ పడుకొనే సమయంలో సుశీల బస్తాసందులో చూచింది పెట్టెలోడబ్బులు పెట్టెలోనే వున్నాయి తన వుపాయం పారిందనుకొని పెట్టె తీసి జాగా మార్చి దాచింది. వెళ్ళి పడుకొని నిశ్చింతగా నిదురపోయింది గోపీ రాత్రంతా పదునాలుగు రూపాయలగురించి తియ్యని కలలు కన్నాడు. తెల్లారింది గోపీ పరుగున వెళ్ళి బస్తాలసందులో చూశాడు. బిక్కమొగం వేశాడు.